క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రేపల్లె పట్టణం, రూరల్ పరిధిలోని బేతపూడి, గుడ్డికాయలంక, పెనుమూడి, కారుమూరు, వేజెల్లవారిలంక, నల్లూరు, పేటేరు, నల్లూరుపాలెం, సింగుపాలెం, విశ్వేశ్వరం, మోర్తోట, చాటగడ్డ, అరవపల్లి, ఉప్పూడి గ్రామాల్లో సరఫరా నిలిపి వేయనున్నట్లు డీఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

డ్రైనేజీల్లో పూడికతీతకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో పూడికతీత పనులను శుక్రవారం పరిశీలించారు. ముందుగా ప్రధాన డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి అనంతరం అంతర్గత డ్రైనేజీలను కూడా శుభ్రం చేస్తామని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.కరుణ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



భట్టిప్రోలు(వేమూరు): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని ఐలవరంలో శుక్రవారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు వల్ల చాలామంది మోసపోయి, ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. బాల్య వివాహాలు నేరమని, ఎవరూ ప్రోత్సహించరాదని ఆయన చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ వీరాంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి



కర్లపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు గ్రామాల్లో సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు నల్లమోతువారిపాలెం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆధార్ కార్డులు లేని చిన్నారులను గుర్తించి వాటి మంజూరుకు కృషి చేయాలని చెప్పారు. ఈకేవైసీ పూర్తిగాని రేషన్ కార్డులను గుర్తించి దాన్ని చేయించుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని ఎంపీడీవో సందర్శించారు. మొక్కలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, రహదారుల వెంట త్వరలో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి నాటిస్తామని ఆయన తెలిపారు.

ఏఎస్పీగా పాండురంగ విఠల్ సేవలు స్ఫూర్తిదాయకం



బాపట్ల: ప్రజా రక్షణలో అడిషనల్ ఎస్పీ పాండురంగ విఠల్ చేపట్టిన చర్యలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర దేశీయ వైద్య సంఘం జిల్లా అధ్యక్షులు కొండపల్లి వెంకయ్య పేర్కొన్నారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న అడిషనల్ ఎస్పీని వైద్య సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. ఎస్ఐ నుంచి వివిధ పోలీసు హోదాల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న పాండురంగ విఠల్ సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.వి.ఎల్.కుమార్, కోశాధికారి కె.వి.ఎస్.సాయి మురళీకృష్ణ, దాలి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కన్నీటి సంద్రంలో స్టూవర్టుపురం

- ఆరుగురి మృతితో మిన్నంటిన ఆర్తనాదాలు
- తక్షణమే ఆదుకోవాలంటున్న ప్రజాప్రతినిధులు, స్థానికులు
- దిక్కెవరంటూ రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు



విషాద ఛాయలు అలుముకున్న నరసింహ ఇల్లు



మృతుడు నరసింహ భార్య జాబిల్లిని ఓదారుస్తున్న కుటుంబ సభ్యులు

బాపట్ల టౌన్: మండలంలోని స్టూవార్టుపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.
రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ఆరుగురు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. గ్రామంలో ఏ ఒక్కరిని పలకరించినా కన్నీరే సమాధానమైంది. మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు కాగా...మిగిలిన ముగ్గురు పెళ్లీడుకొచ్చిన యువకులు. రేపో మాపో పెళ్లిచేసుకోవాల్సిన యువత పాడెక్కడంతో కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. ''మాకు దిక్కెవరంటూ యువకుల తల్లిదండ్రులు...నా బిడ్డను ఏం చేయాలయ్యా అంటూ నరసింహ భార్య...మా కుటుంబం మొత్తాన్ని పొట్టన పెట్టుకున్నావా దేవుడా ?'' అంటూ అంకాల కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపురులను సైతం కంటతడి పెట్టిస్తోంది.

ఇదెక్కడి న్యాయం దేవుడా !

నాకు పెళ్లై ఆరు సంవత్సరాలు అయ్యింది. పిల్లులు లేకపోవడంతో పదరాన్ని పాట్లు ఎన్నో పడ్డాను. మొక్కని చెట్టులేదు...దండం పెట్టని గుడి లేదు. ఆరు నెలల కిందట మగబిడ్డ పుట్టాడు. నిన్న మధ్యాహ్నమే పోలేరమ్మ తల్లి గుళ్లో అన్నప్రాసన చేశాం. ఇంతలోనే ఈ ఘటన...ఇదెక్కడి న్యాయం దేవుడా....ఇంకా మాకు దిక్కెవరు...ఆరు నెలల పసిబిడ్డను నేనెట్టా సాకాలయ్యా...నా బిడ్డకు తండ్రిలేడనే నిజాన్ని ఎట్టా చెప్పాలయ్యా !

– జాబిల్లి
(మృతుడు నరసింహ భార్య)

ప్రభుత్వమే ఆర్థిక భరోసా కల్పించాలి

మా గ్రామానికి చెందిన ఆరుగురు రోడ్డు ప్రమాదంలో అసువులు బాయడం బాధాకరం. మృతి చెందిన వారంతా రెక్కాడితేకానీ డొక్కాడని బడుగు జీవులు. రెక్కల కష్టంపై బతికే వారిని దిక్కులేని వారిగా మార్చింది రోడ్డు ప్రమాదం. ఇంత దారుణమైన ఘటన ఏ గ్రామానికీ కూడా జరగకూడదు. మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలి. కుటుంబ పెద్దలను, యువతను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలి.

– చిన్నపోతుల హరిబాబు, ఎంపీపీ

మా కుటుంబాల్లో కన్నీళ్లే మిగిలాయి

మృతిచెందిన వారంతా మా కుటుంబ సభ్యులే. వారిలో ముగ్గురు మా దగ్గరి బంధువులు. మా అన్నదమ్ములు...మా చిన్నమ్మ, మా చెల్లి ఒకేసారి ఇంత దారుణంగా మృతి చెందుతారని కలలో కూడా ఊహించలేదు. తల్లడిల్లిపోతున్న మా బంధువులను ఎలా ఓదార్చాలో అర్థం కావడంలేదు. ఏ దేవుడు కూడా మా కుటుంబాన్ని కాపాడలేకపోయాడు. ప్రభుత్వ పెద్దలు మా కుటుంబాలకు అండగా నిలబడాలి. మమ్ములను ఆదుకోవాలి.

– బొచ్చు విజయ్‌కుమార్

విధులను సమర్థంగా నిర్వహించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 16,17,18 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తూర్పు కాల్వలో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలవల్లో వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

- మురుగు కాల్వలను ప్రతి రోజు బాగు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతి రావు సూచించారు. మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత పనులు జరుగుతాయని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

చౌకధర దుకాణాల వద్ద రేషన్ పంపిణీకి ఏర్పాట్లు

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం 1వ తేదీ నుండి చౌకధర దుకాణాల్లోనే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల యజమానులతో శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గతంలో మాదిరిగా ఇకపై జూన్ 1 నుంచి 15 వరకు ప్రజా పంపిణీ విధానం దుకాణాల వద్దే రేషన్ సరఫరా విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు మౌలిక సదుపాయాలను దుకాణాల వద్ద కల్పించాలని చెప్పారు. ఆలస్యంగా వచ్చిన వినియోగదారులను వట్టిచేతులతో పంపించకుండా రేషన్ అందేలా సమయం కేటాయించాలని నిర్దేశించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో ఇటీవల వార్డుల్లో పర్యటించిన తమకు సకాలంలో రేషన్ అందలేదన్న ఫిర్యాదులు ఎక్కువగా వినిపించాయని, ప్రజా సమస్యలకు తావులేకుండా పాత పద్ధతిలో దుకాణాల వద్దే రేషన్ పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. చౌకధర దుకాణాల్లో సేవలు పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేషన్ వాహనాలను ఉచితంగా ఆయా లబ్ధిదారులకు బదలాయించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా బియ్యం అక్రమ రవాణా అరికట్టవచ్చని తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు రిమాండ్

తెనాలిరూరల్: మండలంలోని ఖాజీపేట గ్రామలలో గల లక్ష్మీమైసమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితులను రూరల్ పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకు వచ్చి కోర్టులో హాజరుపరిచారు. రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖాజీపేట గ్రామంలోని లక్ష్మీ మైసమ్మ తల్లి గుడిలో ఈ నెల 2వ తేదీ గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి అమ్మవారి వెండి కిరీటం, బంగారు మంగళసూత్రాలు, ఇతర వస్తువులు అపహరించుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ చోరీ కేసులో గుంటూరు నల్లపాడు పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, తెనాలి మండలం ఖాజీపేట ఆలయంలో చోరీ విషయాన్ని అంగీకరించారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన నార్సింగ్ గంగాధర్, నార్సింగ్ మహేష్, పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన వేమవరపు విద్యాసాగర్, తెనాలి పట్టణ సీఎం కాలనీకి చెందిన కారంపూడి విజయ్ కుమార్, బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన పుట్టా వెంకటేష్ గతంలో నేరాలు చేసి జైలుకు వెళ్లారు. అక్కడ వీరందరికి పరిచయమై జైలు నుండి విడుదలయి వచ్చాక నేరాలకు పాల్పడుతున్నారు. వీరిని పీటీ వారంట్ పై గుంటూరు సబ్ జైలు నుండి తీసుకొని తెనాలి రూరల్ పోలీసులు వెండి కిరీటాన్ని స్వాధీనపర్చుకున్నారు. నిందితులను తెనాలి న్యాయమూర్తి ఎదుట శుక్రవారం హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారు.

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు

1,008 మామిడి పండ్లతో అభిషేకం



విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయుడు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి జయంతి, కల్యాణ ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులు సుప్రభాత సేవలతో పూజలు ప్రారంభించారు. అనంతరం 1,008 చూత ఫలాలతో (మామిడి పండ్లతో) విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి స్వామికి నైవేద్యాలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం రాజుపాలెం గ్రామానికి చెందిన మహిళా బృందం కోలాటం ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా మొదటి మూడు రోజుల్లో అన్ని టికెట్ల ద్వారా రూ. 26,635, విరాళాల ద్వారా రూ.1,86,910 కలుపుకుని మొత్తం రూ. 2,13,545 ఆదాయం వచ్చినట్లు ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

తెనాలిరూరల్: పదో తరగతి సప్లమెంటరీ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్ర వారం పరిశీలించారు. రెగ్యులర్ విద్యార్థులకు, ఓపెన్ స్కూల్ విధానంలో పరీక్ష రాస్తున్న వారికి సప్లమెంటరీ పరీక్షలు ఏకకాలంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ ద్వారా పరీక్ష కేంద్రాల వివరాలను, విద్యార్థుల హాజరు శాతం, పరీక్షలు నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో లక్ష్మీనారాయణ ఉన్నారు.

నమస్తే స్కీంను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమస్తే స్కీంను అర్హులైన వారందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మాషెడ్డులో శుక్రవారం నమస్తే స్కీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో చిత్తు కాగితాలు, జుట్టు, పాత ఇనుము, ప్లాస్టిక్ డాబాలు సేకరించే వారి కోసం స్కీంను ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. స్కీంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన ప్రభుత్వం ఐడీ, హెల్త్ కార్డులతో పాటు పీపీ కిట్లు, వారి పిల్లలకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్, దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ హేమలత, జిల్లా కో–ఆర్డినేటర్ నిర్మల, రజిని పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొని యువకుడి మృతి

తెనాలిరూరల్: ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీ కొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగలకుదురుకు చెందిన షేక్ సుభాని (24) గురువారం అర్ధరాత్రి దాటాక తెనాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో రోడ్డు పక్కన ఎలాంటి పార్కింగ్ లైట్లు, ఇతర భద్రతా చర్యలు లేకుండా రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇదయతున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ శుక్రవారం తెలిపారు.

ప్రభుత్వ పథకాల్లో వేస్ట్ పికర్లకు భాగస్వామ్యం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె: ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించేవారిని ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేసి సాధికారత కల్పించేందుకు సమగ్ర నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) పథకం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకునే వారు, జుట్టు సేకరించే వారు, అనధికార పారిశుద్ధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు కల్పించడానికి ఈ పథకం తోడ్పడుతుందని చెప్పారు. ఈ పథకం ద్వారా నమోదు చేసుకున్న వారికి వృత్తికి ఉపయోగపడే పీపీఈ కిట్లు అందజేయనున్నట్లు చెప్పారు. ఆధార్‌లు లేని వేస్ట్ పికర్లను గుర్తించి వారికి కార్డులు తీయించనున్నట్లు చెప్పారు. జీరో బ్యాంక్ అకౌంట్,ఈ– శ్రమ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రతి ఒక్కరికీ అందే విధంగా చూడటం ఈ పథకం యొక్క లక్ష్యం అని వివరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే వేస్ట్ పికర్ల పిల్లలకు ఈ పథకం ద్వారా ఫీజులను చెల్లించడం జరుగుతుందని తెలిపారు.దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ మాట్లాడుతూ రేపల్లెలో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జుట్టు సేకరించే వారు వందలాదిగా ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. సామాజిక భద్రత పథకాలలో వారిని భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 40 మందిని నమోదు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక అసమానతలు తొలగింపు



మాట్లాడుతున్న సీడీపీఓ సుచిత్ర

రేపల్లె: విద్యతోనే ఆర్థిక అసమానతలు తొలగింపబడతాయని సీడీపీఓ ఎం.సుచిత్ర చెప్పారు. కిశోరి వికాసం వేసవి ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తిగత అభివృద్ధి, ఆర్థిక ఎదుగుదలకు విద్య ఎంతో అవసరమని తెలిపారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు వివక్షకు గురవుతున్నారని చెప్పారు. చిన్న వయసులో బాలికలకు వివాహాలు చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. బాల్య వివాహాలు కూడా చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివజ్యోతి, మహిళ సంరక్షణ కార్యదర్శి బి. హరిత, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నాటు సారాతో జీవితాలు నాశనం



గుడ్డికాయలంకలో ఎక్సైజ్ సిబ్బంది ర్యాలీ

రేపల్లె: నాటు సారా తాగి జీవితాలను నాశనం చేసుకోవద్దని రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ సూచించారు. నవోదయం 2.0లో భాగంగా శుక్రవారం మండలంలోని గుడ్డికాయలంకలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబం సైతం ఛిన్నాభిన్నం అవుతుందని తెలిపారు. శరీరంలోని ప్రతి అవయవం దెబ్బతింటుందని చెప్పారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని తెలిపారు. దీనికి పాల్పడే వారిపై తమకు సమాచారం అందించాలని కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎస్ఐ రాజశ్రీ , సిబ్బంది పాల్గొన్నారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభ



తెనాలి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభను జూన్ 5న నిర్వహించనున్నారని, దానిలో అందరూ పాల్గొనాలని యూనియన్ తెనాలి ప్రధాన కార్యదర్శి కారుమూరి కమల కుమారి కోరారు. పాత ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రానున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దగ్గుపాటి సుధీర్, దీపాల శ్రీనివాసరావు, షేక్ అన్వార్, అంది బాలచంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి ఆదర్శనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశీర్వాదం తదితరులు

సత్తెనపల్లి: అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయుడని జై డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ నాయకుడు గుంటూరు ఆశీర్వాదం అన్నారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడిలో 16 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించే క్రమంలో శుక్రవారం స్లాబ్ నిర్మాణం చేపట్టారు. అంబేడ్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రజా చైతన్య భారతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర అసాధారణమైందని తెలిపారు. ప్రజా చైతన్య భారతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు దూబగుంట్ల జానకీ రామారావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పేద కుటుంబాలకు క్వింటా బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఏకుల రాజశేఖర్, సర్పంచ్ గుగ్గిలం అంకమ్మ, గ్రామ పెద్దలు పురం సుందరరావు, బిల్లా రవిబాబు, కాశిమాల విజయబాబు, పురం సుధాకర్, పురం పెద్ద ఆదాం, తురుమెళ్ల దావీదు, కాశిమాల ఏసోబు, కంచకర్ల బాలకృష్ణ, మాల మహానాడు అధ్యక్షుడు కంచకర్ల జోసెఫ్, 7వ వార్డు మెంబర్ తురిమెళ్ల కోటేశ్వరరావు, పురం మరిదాసు, పురం విద్యాసాగర్, కంచకర్ల భరత్, వీరయ్య పాల్గొన్నారు.

సేవా భూషణ్ అవార్డు గ్రహీత దాసుకు సన్మానం



దాసును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు గురువారం 'సేవా భూషణ్' అవార్డు గ్రహీత గార్లపాటి దాసును వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ దాసు ముున్ముందు మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు వెలది అప్పారావు, జెడ్పీటీసీ సభ్యురాలు జమీలా గఫూర్, ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, ఉపాధ్యక్షులు విప్పల వెంకట్రామిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, క్రోసూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలకా దాసయ్య, పార్టీ గ్రామ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా బీసీ నాయకులు కోనంకి గురునాథం, పండిటి వీరయ్య, షేక్ అల్లా బక్షు పాల్గొన్నారు.

'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత వైద్యశిబిరం

200 మందికి వ్యాధినిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్



తెనాలి: వ్యాధిరహిత తెనాలి కోసం కృషిచేస్తున్న పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్–చక్ర క్యాన్సర్ సెంటర్ తక్కెళ్లపాడు సంయుక్తంగా జరిపిన వైద్యశిబిరంలో డాక్టర్ డి.శారద, ఇతర వైద్యులు, 200 మందికి బీపీ, షుగరు, థైరాయిడ్, స్కానింగ్, ఎక్స్‌రే, పాప్‌స్మియర్ వంటి పరీక్షలను చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి హాజరై శిబిరాన్ని ప్రారంభించి, కరపత్రాన్ని ఆవిష్కరించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్ పాస్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ అయిన యువత వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల వరకు ఉండాలని పేర్కొన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు. కోర్సులో భాగంగా ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.